పింఛన్.. నెలనెలా ఏడిపించెన్

- పింఛను కోసం సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- తాళాలు వేసి స్వాగతం పలికిన సచివాలయాలు

ప్రత్తిపాడు: పింఛను లబ్ధిదారులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. గత ప్రభుత్వంలో వేకువ జాము కన్నా ముందుగానే తలుపుతట్టి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లను పక్కనబెట్టి, కూటమి ప్రభుత్వం పింఛన్ల బాధ్యతలను ఉద్యోగులకు అప్పగించింది. దీంతో ప్రతినెలా పింఛను పొందేందుకు లబ్ధిదారులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. పింఛనుదారులకు మళ్లీ చంద్రబాబు పాత జమానా గుర్తుకొస్తుంది. కాకపోతే గతంలో పంచాయతీ కార్యాలయాల ముంగిట వృద్ధులు, వికలాంగులు పడిగాపులు కాస్తే, ఇప్పుడు సచివాలయాల వద్ద ఆ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రత్తిపాడు-2 సచివాలయ ఉద్యోగులు సర్వర్ సమస్యను సాకుగా చూపి ఇంటింటికీ వెళ్లి పింఛను ఇవ్వకపోవడంతో లబ్ధిదారులే అధికారులను వెతుక్కుంటూ సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకున్నారు.

సచివాలయాలకు తాళాలు..!

ఇదిలా ఉంటే ఉదయాన్నే ఉద్యోగులు పింఛను ఇచ్చేందుకు ఇళ్ల వద్దకు రాకపోవడంతో, కొందరు వృద్ధులు పింఛను తీసుకునేందుకు మధ్యాహ్నం సమయంలో సచివాలయాలకు వెళ్లారు. సచివాలయాలు మూసేసి ఉండటంతో వారికి చేదు అనుభవం ఎదురైంది. ప్రత్తిపాడు-3 సచివాలయానికి తాళాలు వేసి ఉండటంతో ఏం చేయాలో అర్థంకాక కొందరు వృద్ధులు గంటల తరబడి కుర్చీలోనే వేచి ఉన్నారు. మరికొందరు వృద్ధులు పింఛన్ల కోసం చెట్ల కింద, బల్లలపై పడిగాపులు కాస్తూ కనిపించారు. ఇక ప్రత్తిపాడు-1 సచివాలయం పరిస్థితి కూడా అదే. పింఛను పంపిణీ సమయాన తాళాలు వేసి కనిపించాయి. కొద్దిసేపటి తరువాత సచివాలయ సిబ్బంది వచ్చి తాళాలు తీయడంతో పింఛనుదారులు సచివాలయానికి పింఛను కోసం క్యూగట్టారు. దీంతో సచివాలయంలోనే పింఛన్లను లబ్ధిదారులకు అందించి ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇదే విషయమై ఎంపీడీవో శివపార్వతి దృష్టికి తీసుకువెళ్లగా రాష్ట్రమంతటా సర్వర్ సమస్య ఉత్పన్నమైందని, అందుకే పింఛన్ల పంపిణీ ఆలస్యమైందన్నారు. కానీ లబ్ధిదారులు మాత్రం పింఛను కోసం సచివాలయాల వద్దకు వచ్చారని చెప్పారు. ఇంటికెళ్లి పింఛన్లు ఇవ్వాలని ఇప్పటికే సిబ్బందికి ప్రత్యేకంగా ఆదేశాలివ్వడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.



పింఛను కోసం మూసివేసి ఉన్న ప్రత్తిపాడు-3 సచివాలయం వద్ద వృద్ధులు



మధ్యాహ్నం సమయంలో మూసివేసి ఉన్న ప్రత్తిపాడు-2 సచివాలయం



ప్రత్తిపాడు-1 సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది



ప్రత్తిపాడులో చెట్ల కింద కూర్చుని పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

ఇంటింటా దీపావళి సందడి



పొన్నూరు: వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పొన్నూరులో గురువారం సాయంత్రం నుంచే కాకరపువ్వులు, భూచక్రాలు, తారాజివ్వల వెలుగులతో వీధులన్నీ మెరిసిపోయాయి. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా కొత్త దుస్తులు ధరించి.. బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు. ఇళ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి బాణా సంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.

ఏటుకూరులో దీపం 2 పథకం ప్రారంభం

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చెప్పిన విధంగా దీపావళి కానుకగా మహిళలకు దీపం 2 పథకాన్ని ప్రారంభించటం జరిగిందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఏటుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన దీపం 2 పథకం ప్రారంబోత్సవ కార్యక్రమంలో మహిళలకు గ్యాస్ సిలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనమే ఆపద్బాంధవి!!

- పెదనందిపాడు మండలంలో ప్రమాదం జరిగితే అంతే సంగతులు
- 108 ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు ఆస్పత్రికి చేరుస్తుందో తెలియని దుస్థితి
- ప్రమాదం జరిగిన మూడు గంటలకు అందుబాటులోకి వచ్చిన 108 వాహనం

ప్రత్తిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రమాదం జరిగిన పదిహేను, ఇరవై నిమిషాల్లో కుయ్‌కుయ్ మంటూ పెదనందిపాడు ఆస్పత్రికి ఐదు 108 వాహనాలు దూసుకొచ్చాయి. తీవ్ర అస్వస్థతకు గురైన దాదాపుగా పాతిక మంది వ్యవసాయ కూలీలను రయ్‌రయ్‌మంటూ ప్రత్తిపాడు, గుంటూరు, చిలకలూరిపేట, పర్చూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాయి.

సీన్ కట్ చేస్తే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. చెంతనే ఉండాల్సిన 108 వాహనాలు ఇప్పుడు అల్లంత దూరంలో ఉంటున్నాయి. ప్రమాదం జరిగిన గంట, రెండు గంటలకు కూడా వాహనాలు క్షతగాత్రులకు అందుబాటులోనికి రాని దుర్గతి దాపురించింది. గత్యంతరం లేక క్షతగాత్రుడిని పోలీసు వాహనంలో ఆస్ప త్రికి తరలించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన పాశం దుర్గారావు శుక్రవారం మధ్యాహ్నం సుమారు పన్నెండున్నర గంటల సమయంలో గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రులోని అత్తగారింటికి వెళుతున్నాడు. వేగంగా వెళుతూ మార్గమధ్యలో ప్రయాణీకులతో వెళుతున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై, ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. అయితే ఆటోలోని ప్రయాణీకులకు ఎలాంటి గాయాలు కాలేదు.

108 రాకపోవడంతో పోలీసు వాహనంలోనే..

స్థానికులు పెదనందిపాడు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108కు ఫోన్ చేశారు. వాహనం వచ్చేందుకు సమయం పడుతుందని చెప్పడంతో పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. క్షతగాత్రుడు ఊపిరి తీసుకునేందుకు కూడా ఇబ్బంది పడటాన్ని గమనించి ఎస్సై అద్దంకి మధు పవన్ తమ వాహనంలోనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పీహెచ్‌సీలో వైద్యాధికారి లేక..

చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందించేందుకు ఆస్పత్రిలో అత్యవసర సమయాన వైద్యాధికారి విధుల్లో అందుబాటులో లేని పరిస్థితి కనిపించింది. ఆస్పత్రిలో ఆక్సిజన్‌తో లేకపోయినప్పటికీ, విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు, సిబ్బంది దాదాపుగా గంట పాటు శ్రమించి కలిసి దుర్గారావుకు సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి బయటపడేశారు. అయినప్పటికీ గాయపడిన వ్యక్తికి పదేపదే ఎక్కిళ్లు వస్తుండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. కాగా ప్రమాదం 12.40 గంటల సమయంలో జరగ్గా, 108 వాహనం సుమారు సాయంత్రం 3 గంటలకు వచ్చింది. ఆవాహనంలోనే జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు.



ఆటోను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం



క్షతగాత్రుడు దుర్గారావును పోలీసు జీపులో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



వైద్యాధికారి లేకపోవడంతో క్షతగాత్రుడికి అత్యవసర చికిత్స అందిస్తున్న నర్సు

నియోజకవర్గ ఓటర్లు 2,68,226

- ఐదు మండలాల్లోనూ పెరిగిన ఓటర్లు
- ప్రతి మండలంలోనూ మహిళా ఓటర్లే అధికం
- 29న ఓటర్ల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రత్తిపాడు: నియోజకవర్గ ఓటర్ల సంఖ్య రెండున్నర లక్షలు దాటిపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సుమారు 2.50 లక్షలు ఉన్న ఓటర్ల సంఖ్య, 2024 జనవరి 22 నాటికి 2,64,156కు చేరింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025ను ఇటీవల అధికారులు నిర్వహించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి మార్పులు చేర్పులపై అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు నూతన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో అక్టోబరు 29వ తేదీన రెవెన్యూ అధికారులు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు.

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లో మొన్నటి వరకు 2.64 లక్షలు ఉన్న ఓటర్ల సంఖ్య, తాజా ముసాయిదా జాబితా ప్రకారం 2,68,266కు చేరింది. అంటే సుమారు 4,110 మంది ఓటర్లు పెరిగారన్న మాట. ఐదు మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళామణుల చేతుల్లోనే నాయకుల భవిత ఆధారపడి ఉంది.



బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఆయా మండలాల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
గుంటూరువెస్ట్	33,285	36,169	19
గుంటూరు ఈస్ట్	25,942	27,156	3
వట్టిచెరుకూరు	18,637	19,859	–
ప్రత్తిపాడు	19,659	21,005	–
పెదనందిపాడు	16,089	18,201	–
కాకుమాను	15,123	16,399	–
మొత్తం	1,29,455	1,38,789	22

దీపం పథకానికి ని'బంధనాలు'

- షరతులు వర్తిస్తాయట!
- పొన్నూరు నియోజకవర్గంలో రేషన్ కార్డుదారులు 83,261
- గ్యాస్ కనెక్షన్లు 59,476

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలను అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండకపోవడంతో ప్రభుత్వ పనితీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో మహిళలకు ఇస్తామన్న ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి సిలిండర్‌ను (2025 మార్చి 31 వరకు) ఐదు నెలలకు అందించేలా ఏర్పాట్లు చేసింది. మిగిలిన రెండు సిలిండర్లను నాలుగు నెలలకు ఒకటి చొప్పున (ఏడాదికి మూడు) వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ప్రభుత్వం అందించనుంది.

ఉచితంగా సిలిండర్ పొందేందుకు అర్హతలు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను పొందాలంటే కచ్చితంగా చెల్లుబాటులో ఉండే గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డుతోపాటు ఈకేవైసీ పూర్తి చేసుకున్న ఆధార్ కార్డు ఉండాలి. రేషన్ కార్డు లేకపోతే ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అనర్హులు. ఒకవేళ రేషన్ కార్డు ఉన్నా ఆ కార్డు యాక్టివ్‌లో ఉండాలి. అలాగే యాక్టివ్‌లో ఉన్న గ్యాస్ కనెక్షన్ ఉండాలి. అలాగే కుటుంబ యాజమాని ఆధార్ కార్డు కూడా వినియోగంలో ఉంటే ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులవుతారు. లేదంటే లేదు. పొన్నూరులో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు 35,848 ఉండగా, మూడు గ్యాస్ ఏజెన్సీలలో వంటగ్యాస్ కనెక్షన్ కలిగిన కుటుంబాలు 59,476 ఉన్నాయి.

రుసుం ముందే చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలలకు ఒకసారి ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి సిలెండర్ 5 నెలలకు, మిగిలిన రెండు సిలిండర్లు 4 నెలలకోసారి అందించనున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 31వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు లబ్ధిదారులకు మొదటి ఉచిత గ్యాస్ సిలెండర్ అందనుంది. అయితే ముందుగా వినియోగదారుడే గ్యాస్ సిలిండర్ కోసం డబ్బులు చెల్లించాలి. సిలిండర్ డెలివరీ అయిన 24 గంటల తరువాత పట్టణం, 48 గంటల తర్వాత పల్లెల్లో వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బును గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. అయితే ఈకేవైసీ చేయించకపోవడం వంటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో ప్రజలు ఆధార్‌లో సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలు, గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ కోసం ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.



గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గంలో రేషన్ కార్డుదారులు, గ్యాస్ కనెక్షన్లు

మండలం	రేషన్ కార్డుదారులు	గ్యాస్ కనెక్షన్లు
పెదకాకాని	24645	17607
చేబ్రోలు	22758	17045
పొన్నూరు	35858	24824
మొత్తం	83261	59476

అండగా ఉంటాం: అంబటి



పెదకాకాని: వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని గొడపాలెంకు చెందిన బొర్రా ఏడుకొండలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అలాగే పెదకాకాని పాతూరు యాదవపాలెంకు చెందిన తాడిబోయిన వేణుగోపాల్ రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. పార్టీ నాయకులు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం పెదకాకాని చేరుకుని బొర్రా ఏడుకొండలు, తాడిబోయిన వేణుగోపాల్ నివాసాలకు వెళ్ళి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ వెంట స్థానిక పార్టీ నాయకులు గోళ్ళ శ్యాంముఖర్జీబాబు, వుయ్యూరు సతీష్‌రెడ్డి, చాగంటి మురళీమోహన్ రెడ్డి, కుక్కల రాంప్రసాద్, కారంకి వెంకటేశ్వరరావు, షేక్ ఆరిఫ్, ఆలపాటి రాఘవ పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



వడ్లమూడి గొడపాలెంలో నివాళులు అర్పిస్తున్న ఎంఈవో రామరావు



పొన్నూరులో నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొన్నూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని తహసీల్దార్ కార్యాలయానికి బహుకరించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అవ్వారు వెంకటేశ్వరరావు, సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో...

చేబ్రోలు: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన, అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గొడపాలెంలోని ఎంపీపీ స్కూల్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఆయన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఎంఈవో రాయల సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు శ్రీకారం చుట్టిన మహానుబావుడు, సిసలైన గాంధేయవాది అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ దీక్ష చేసి ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములను తెలుగుజాతి స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నూరులో దగ్ధమైన పండ్ల దుకాణం

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పండ్ల దుకాణం అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు దుకాణంలో మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో స్వల్ప నష్టం మాత్రమే వాటిల్లిందని శాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

సుద్దపల్లి(చేబ్రోలు): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న యువకుడిని చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన సుద్దపల్లి ఇసాక్ తన ఇంటి సమీపంలో పాలక్యాన్‌లో మద్యం సీసాలు పెట్టుకొని విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఇసాక్ నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో రూ.51 లక్షలు మోసం

చేబ్రోలు: ఆన్‌లైన్‌లో వచ్చిన ఫోన్ మెసేజ్‌ను నమ్మి ప్రముఖ వ్యాపారి డబ్బులు అకౌంట్‌కు జమ చేసి మోసపోయిన సంఘటనపై చేబ్రోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలుకు చెందిన ప్రముఖ వ్యాపారికి మెసేజ్ రావటంతో దానిని నమ్మి రెండు విడతలుగా రూ.35 లక్షలు, 17 లక్షలును రెండుసార్లుగా డబ్బులు అకౌంట్‌కు జమ చేశారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై చేబ్రోలు ఎస్‌ఐ డి వెంకటకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా కాల్చే విషయమై వివాదం

గుంటూరు రూరల్: దీపావళి పండగ సందర్భంగా నివాసాల మధ్య బాణ సంచాను పేల్చే సంఘటనలో వివాదం జరిగి దాడికి పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని కాలనీలో నరేంద్ర రెడ్డి, అవినాష్ అనే ఇరువురు నివశిస్తూ ఉంటారు. దీపావళి పండగ సందర్భంగా గురువారం అందరూ బాణసంచాను పేల్చుకుంటున్నారు. ఈ క్రమంలో అవినాష్ అనే వ్యక్తి ఇంటిముందు బాణాసంచాను పేల్చుకుంటుండగా అవి నరేంద్రరెడ్డి ఇంటిలోకి పడుతున్నాయని నరేంద్రరెడ్డి ఒకటికి రెండుసార్లు అవినాష్‌కు తెలిపాడు. ఇంట్లోకి పడకుండా కాల్చుకోవాలని నంరేంద్ర రెడ్డి తెలిపాడు. దీంతో ఇరువురి మధ్యన వివాదం తలెత్తింది. దీంతో నరేంద్ర రెడ్డి అవినాష్‌పై దాడిచేయగా అవినాష్‌కు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతనికి చికిత్స నందించి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



గాయాలైన అవినాష్

క్లుప్తంగా

కళ్లం కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు రూరల్: చౌడవరం గ్రామంలోని కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపకుడు కళ్లం హరనాథ రెడ్డి 89వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళ్లం హరనాథరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజు కనీసం గంటసేపు నడవాలని తెలిపారు. మానవ శరీరంలో కళ్ళు ప్రధానమైనవని వాటిని ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మాక్సి విషన్ కంటి వైద్యశాల వైద్యుడు డాక్టర్ రామలింగార్డెడ్డి, శేఖర్‌బాబు, ప్రత్యేష డెంటల్ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఎస్‌డీ నసీమ విద్యార్థులకు వైద్యులకు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఏవో కళ్ళం నవ్య, డి శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ పీఎల్ మాధవరావు, పీడీ పీ పున్నారెడ్డి పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన




గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని లాంఫాం నందున్న ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఏసీఎస్ సభ్యులకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం జొన్నలగడ్డ గ్రామంలో ప్రత్తిపంటల్లో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) సభ్యులకు ప్రత్తిపంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి అవగాహన కల్పించారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యంతోపాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంతో పర్యావరణ కాలుష్యాన్ని నివారించి, మిత్రపురుగుల సంఖ్యను పెంచవచ్చని తెలిపారు. ప్రత్తి పంటల్లో ఆరు వరసలకు ఒక వరస కంది విత్తుకోవాలని, అదే విధంగా పంట చుట్టు జొన్న, మొక్కజొన్న పంటలను విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు ఆవుల కోటేశ్వరరావు, వంగా నవీన్‌రెడ్డి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చిప్స్‌లో రాష్ట్రీయ ఐక్యత దినోత్సవం



గుంటూరు రూరల్: స్వాతంత్య్రం తరువాత భారతదేశాన్ని ఏకం చేయటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఐక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె సుబ్బారావు, కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

బార్‌తో ఇబ్బంది ఉంది.. తొలగించాలి



గుంటూరు రూరల్: స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్న బార్‌ను తొలగించాలని మహిళలు అందోళన చేసిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపాలెం ఇన్నర్‌రింగ్ రోడ్డులోని సెలబ్రేషన్స్ బార్ స్థానిక మహిళలకు ఇబ్బందిగా ఉందని, మద్యం సేవించిన వ్యక్తులు మహిళలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు బార్ వద్ద ఆందోళన చేపట్టారన్నారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని స్థానికులకు, బార్ యాజమాన్యానికి నచ్చజెప్పి ఆందోళనకారులను పంపించి వేశారు.

ముస్తాబైన శివాలయాలు

పొన్నూరు: కార్తిక మాసం శనివారం నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పొన్నూరులోని పలు శివాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఆలయ అధికారులు, కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను విశేషంగా అలంకరించారు. అధికారులు ఆలయ సమీపంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.